ఈనాడు నాగర్‌కర్నూల్

మంగళవారం సెప్టెంబరు 1, 2026

తొలుత చదును.. ఆపై ఆక్రమణ

అంబట్‌పల్లిలోని గుట్ట వద్ద ఇలా

ఈనాడు డిజిటల్, నాగర్‌కర్నూల్: జిల్లాలో ప్రభుత్వ భూములను ఆనుకొని ఉన్న కొందరు పట్టాదారులు క్రమంగా హద్దులు దాటి వాటిని చదును చేస్తూ స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రభుత్వ గుట్టల్లోని మట్టిని కొందరు అక్రమంగా తరలిస్తుంటే..ఆ తర్వాత అదే ప్రాంతాన్ని ఇంకొందరు చదును చేసి క్రమంగా సాగుభూమిగా మార్చేస్తున్నారు.

నిఘా

అధికారులకు ఫిర్యాదు..

లింగాల మండలం అంబటిపల్లి గ్రామంలోని సర్వేనం 471లో 6.36 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా చదును చేసి సాగుకు సిద్ధమవుతుండగా పంచాయతీ తరఫున ఉపసర్పంచి సోమవారం 'ప్రజావాణి'లో ఫిర్యాదుచేశారు.

మరికొన్ని ఇలాంటివి..!

కోడేరులోని ఊరగుట్టను మూడు ఎకరాల వరకు తవ్వేసి మట్టిని మామిడితోటను పెంచుతున్నారు. పసుపుల సమీపంలో గుట్ట శివారులో రెండెకరాల వరకు సాగుచేస్తున్నారు. కొల్లాపూర్ నుంచి సోమశిల వెళ్లేదారిలో గుట్టల్ని, అటవీభూమిని చదును చేస్తున్నారు. పెంట్లవెల్లి శివారులోని ఎల్లమ్మతిప్ప వద్ద ఉన్న భూమి ఆక్రమణకు గురవుతోంది. తెలకపల్లి, రఘుపతిపేటకు సమీపంలోని రామగిరిగుట్ట మట్టిని నిత్యం తరలిస్తున్నారు. అక్కడ చదును చేసిన ప్రాంతంలో క్రమంగా కొందరు వ్యక్తులు సాగులోకి తీసుకుంటున్నారు. పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను క్రమంగా చదును చేస్తున్నారు. అటవీ భూముల్లోని చెట్లను తొలగిస్తూ ఎకరాలను సాగులోకి తెస్తున్నారు.

ఆర్ఐతో విచారణ

అంబటిపల్లి శివారులోని సర్వేనం 471లో ప్రభుత్వ భూమి ఉంది. ఆక్రమణ విషయమై ఆర్ఐతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తాం. తగిన చర్యలు తీసుకుంటాం.
-వెంకటేశ్, తహసీల్దార్, లింగాల

గుంతల దారి... అవస్థగా మారి...

పుర పరిధిలోని ఎండబెట్ల నుంచి తాడూరు మండలంలోని చర్లపల్లి, చర్ల తిర్మలాపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి రెండైన తారు తొలగిపోయి గుంతలుగా మారింది. రహదారి నిండా దాదాపు 7 కి.మీ. మేర గుంతలు ఉండటంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. -న్యూస్‌టుడే, కందనూలు

ఖర్చు చేసేదెంత..?

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే: వివిధ శాఖలకు కేటాయించిన నిధుల్లో ఎస్సీల అభివృద్ధికి నిధులు ఖర్చు చేయనున్నారో ఇక నుంచి సమీక్షించనున్నారు. ప్రతి శాఖ నిధులను ఎందుకు ఖర్చు చేస్తున్నారన్నది స్పష్టం... కొన్ని శాఖలు ఖర్చు చేయడం లేదు. దీంతో ఇవి వెనక్కి వెళ్లిపోతున్నాయి. కొన్నిచోట్ల కేటాయింపులే ఉండటం లేదు. ఇటీవల తొలిసారిగా ఎంపీ మల్లురవి అధ్యక్షతన కలెక్టరేట్‌లో వివిధ శాఖల్లో ఎస్సీల అభివృద్ధి పనులు, ఖర్చులపై సమీక్షించారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వచ్చిన నిధులు, ఖర్చులపై ఆరా తీశారు. ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు వెచ్చించారు...మిగతా వాటికి అంతంతమాత్రంగానే జరిగినట్లు గుర్తించారు. 23 శాఖల పరిస్థితిని సమీక్షిస్తే పదింటికి మాత్రమే కేటాయింపులు, ఖర్చులు చేయగా...మిగతా వాటి గురించి పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు.

పురాల్లో నామమాత్రమే

జిల్లాలోని నాలుగు పురాల్లో గత ఐదు నెలల్లో ఎస్సీ కాలనీల్లో నిధులు ఖర్చు చేసింది నామమాత్రమే. ప్రతి ఏడాది ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారు. కొన్నిచోట్ల మొక్కుబడిగా పనులు సాగుతున్నాయి. కొల్లాపూర్ పుర పరిధిలోని 17వ వార్డులో తాగునీటి పైపులైనుకు రూ. 7లక్షలు, పదో వార్డులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు, 17వ వార్డులో నిర్మాణ పనులకు రూ. 20 లక్షలు మంజూరయ్యాయి. కానీ ఎక్కడా పనులు మొదలు కాలేదు. కల్వకుర్తి పురపాలికలో హైమాస్ట్ లైట్ల కోసం రూ.1.50 లక్షలు కేటాయించారు. కానీ టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట పురాల్లో గత ఐదు నెలల్లో ఎస్సీ కాలనీల్లో నిధులు మంజూరు కాలేదు. అన్ని శాఖల్లో ఎస్సీల అభివృద్ధికి కేటాయించిన నిధులు ఖర్చు చేసేలా చర్యలు చేపట్టినట్లు ప్రత్యేక అభివృద్ధి కమిటీ కన్వీనరు ఉమాపతి తెలిపారు. ఇక నుంచి ఈ సమీక్షలు తరచూ నిర్వహించే అవకాశం ఉందని చెప్పారు.

వివరాలు ఇలా..!

ఉద్యాన శాఖ: రూ.90.46లక్షలు

హౌసింగ్ శాఖ: రూ.57.43 కోట్లు

వ్యవసాయశాఖ: రూ.54.35 లక్షలు

సమగ్ర శిక్షా అభియాన్: 20,096 లబ్ధిదారులు

శిశు మహిళా సంక్షేమ శాఖ: 15,985 లబ్ధిదారులు

గద్వాల: మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ డీకే అరుణ, డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్‌బాష షేక్

రూ.108 కోట్లతో రైల్వే అభివృద్ధి పనులు

● 2027లో గద్వాల స్టేషన్ శతాబ్ది ఉత్సవాలు ● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గద్వాల కలెక్టరేట్, అలంపూర్, శాంతినగర్, న్యూస్‌టుడే: వందేళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న గద్వాల రైల్వే స్టేషన్ శతాబ్ది ఉత్సవాలను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 2027 ఏప్రిల్‌లో నిర్వహిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న అమృత్ భారత్ పథకంలో భాగంగా గద్వాల రైల్వే స్టేషన్‌లో రూ.108 కోట్లు వ్యయం చేస్తూ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఇటీవల రెండో రైల్వే గేటు వద్ద రూ.66 కోట్లతో మరో ఆర్వోబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గద్వాల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీ డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తెలంగాణలో 42 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.886 కోట్లు మంజూరు చేస్తే.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఒక్క తెలంగాణలో రైల్వేలకు రూ.5,454 కోట్లు కేటాయించిందన్నారు. ఈ ఏడాది 118 ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణంలో భాగంగానే గద్వాలకూ మంజూరు చేశారని గుర్తుచేశారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. గద్వాల మీదుగా రాకపోకలు సాగిస్తున్న పలు రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వందేభారత్ గద్వాల స్టేషన్‌లో హాల్ట్‌కు పరిశీలించాలని రైల్వే ఉన్నతాధికారులను కోరారు. డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల పుర ఛైర్‌పర్సన్ జయలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించాలి: కలెక్టర్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే: సంచార జాతులు ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించాలని కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సంచార జాతుల 75వ విముక్తి దినోత్సవాన్ని నిర్వహించారు. మహాత్మా జ్యోతి బాపులే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనకబడిన వర్గాల అభ్యున్నతికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు పాల్గొన్నారు. అనంతరం ప్రధానమంత్రి ధన్ ధాన్య యోజనపై కేంద్ర వ్యవసాయ శాఖ జాయింట్ కార్యదర్శి నితిన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో ఈ పథకం కింద 11 శాఖల పరిధిలో చేపడుతున్న పనులు వివరించారు.

కలెక్టరేట్‌లో నివాళులు అర్పిస్తున్న హేమంత కేశవ పాటిల్, అధికారులు, నాయకులు

సదుపాయాలు లేక చింత

కందనూలు, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు పట్టణాల్లో నివాసం ఉండటానికి సిద్ధమవుతుండగా.. ..ఇక్కడ సమస్యలు వారికి కంటిమీద కునుకు పట్టనీయడం లేదు. శివారు కాలనీల్లో ఇళ్లను నిర్మించుకుంటున్న వారు సదుపాయాలు లేక ఇబ్బందులుపడుతున్నారు. పుర సంఘాలకు ఆదాయం వస్తున్నా...అభివృద్ధి పనులు మాత్రం చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. జిల్లాలోని నాలుగు పుర సంఘాల పరిధిలోని శివారు కాలనీల్లో సమస్యలపై 'న్యూస్‌టుడే' కథనం.

పట్టణంలోని 19వ వార్డుశివారు ప్రాంతంలో ఇళ్ల మధ్య మురుగు

ఎక్కడికక్కడ అపరిశుభ్రత

జిల్లా కేంద్రంలోని 19వ వార్డు, నాగనూల్ బీసీ కాలనీ, మధురానగర్, ఆర్టీసీ బృందావన్ కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు జరగకపోవడంతో మురుగంతా ఇళ్ల మధ్య నిల్వ ఉంటోంది. రాత్రివేళ దోమల బెడద ఎక్కువగా ఉండటంతో కాలానుగుణ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కాలువల నిర్మాణాలు చేపట్టాలని పలుమార్లు అధికారులకు, ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేసినా... పరిష్కారం కాలేదంటున్నారు. కాలనీల్లో అపరిశుభ్ర సమస్య వేధిస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రహదారులు లేక...

అచ్చంపేట పుర పరిధిలోని చింతల్‌బస్తీ, మహేంద్రనగర్, ఆదర్శనగర్, మధురానగర్, న్యూ వెంకటేశ్వర కాలనీ, సాయినగర్, వలపట్ల శివారు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో పాదచారులు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా....మట్టి దారులు బురదగా మారుతున్నాయని చెబుతున్నారు. జిల్లాలోని కొల్లాపూర్, కల్వకుర్తి పట్టణాల్లోని కాలనీల్లో కాలువలు, సీసీ రహదారుల నిర్మాణాలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. నాగర్‌కర్నూల్ పుర పరిధిలోని శివారు కాలనీలో పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కమిషనర్ నాగిరెడ్డి పేర్కొన్నారు.

ఆర్టీసీ ప్రాంగణాలు.. సమస్యలకు నిలయాలు

(అచ్చంపేట)

అచ్చంపేట న్యూటౌన్, లింగాల, తిమ్మాజిపేట, తెల్కపల్లి, కొల్లాపూర్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంతో పాటు పట్టణ, మండల కేంద్రాల్లోని ఆర్టీసీ బస్టాండ్లలో కనీస వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్టాండ్లలో కల్పించాల్సిన వసతులను 'న్యూస్‌టుడే' పరిశీలించగా.. తాగునీరు, శౌచాలయాలు, కుర్చీలు, ఫ్యాన్లు తదితర సదుపాయాలు కనిపించడంలేదు. ప్రాంగణాల్లో బురదమయమైన గుంతలతో పాటు పలు చోట్ల షెల్టర్లు లేక బస్సుల కోసం గంటల సేపు రోడ్డుపై నిరీక్షిస్తూ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

న్యూస్‌టుడే పరిశీలన

రోడ్డుపైనే నిరీక్షణ

అచ్చంపేట పట్టణంలోని నెహ్రూ, అంబేడ్కర్ కూడళ్లలో బస్ షెల్టర్ లేక ఎండ, వానలో రోడ్డుపై నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో వాహనాల రద్దీతో తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీ సమీపంలో పేరుకుపోతున్న వ్యర్థ జలాల్లో నిత్యం పందులు స్వైర విహారం చేస్తున్నాయి. బహిరంగ మూత్ర విసర్జనతో బస్టాండ్ పరిసరాలు దుర్వాసనను వెదజల్లుతున్నాయి.

(తిమ్మాజిపేట)

శౌచాలయాలు లేక..

తిమ్మాజిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో శౌచాలయాలు లేక మహిళలు దయనీయమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సౌకర్యం లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కనీసం కూర్చోవడానికి కుర్చీలు లేక గంటల తరబడి నిల్చోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బస్టాండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ జులై 8న శంకుస్థాపన చేసినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు.

లోపించిన పారిశుద్ధ్యం..

బస్టాండ్‌లో పారిశుద్ధ్యం లోపించడంతో పందులు చేరి పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. బస్సులు బస్టాండ్ లోపలికి, బయటకు వెళ్లాలంటే ఎదురుగా ప్రైవేటు వాహనాల రద్దీతో ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయి దుర్వాసనతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

(కొల్లాపూర్)

(తెలకపల్లి)

గంటల సేపు ఎదురుచూపులే

మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుంచి బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. తెలకపల్లి నుంచి శ్రీశైలం, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్ వెళ్లాల్సిన ప్రయాణికులు బస్టాండ్‌లో తాగునీరు, కుర్చీలు, ఫ్యాన్లు లేక ప్రాంగణం, పరిసరాల్లో అవస్థలు పడుతున్నారు. రద్దీ కారణంగా గంటల కొద్దీ బస్సుల కోసం బస్టాండ్‌లో నిల్చొని ఎదురుచూడాల్సి వస్తోంది. వర్షం వస్తే ప్రాంగణం బురదమయం అవుతోంది.

వెలిగొండ పేరిట జలచౌర్యం.. అడ్డుకోని సీఎం : భారాస

ప్రాజెక్టుల వివరాలు తెలియజేస్తున్న నిరంజన్ రెడ్డి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ అడ్డగోలుగా కృష్ణా జలాలను దోపిడీ చేస్తుంటే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. సోమవారం భారాస జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డితో కలిసి ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కృష్ణా నది జలాల్లో తెలంగాణ వాటా గురించి వివరించారు. తెలంగాణ ఏర్పడ్డాక తాము అధికారం చేపట్టిన అనంతరం కేఎల్ఐ కోసం రూ.800 కోట్లు ఖర్చు చేశామని, పాలమూరు-రంగారెడ్డికి నిధులు కేటాయించి దాదాపు 85 శాతం పనులు పూర్తి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి మూడేళ్లు కావస్తున్నా నేటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది అన్నచందంగా పనులు నిలిచి పోయాయని విమర్శించారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధం.. నల్లమల సురక్షితం

ఏటీఆర్‌లో వ్యర్థాల రీసైక్లింగ్

అమ్రాబాద్, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ భూతం నుంచి నల్లమలలోని వన్యప్రాణులు, అడవి నేల, జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు అటవీ శాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. నల్లమలను ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. మన్ననూరు చెక్‌పోస్టు వద్ద భక్తులు, పర్యాటకుల నుంచి ప్లాస్టిక్ నీటి సీసాలు, కవర్లను సేకరించి అడవిలో వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. సేకరించిన వ్యర్థాలను మన్ననూరు బెయిలింగ్ సెంటర్‌కు తరలించి బెయిళ్లుగా మార్చి విక్రయిస్తున్నారు.

మన్ననూరులో బెయిలింగ్ యంత్రంలో ప్లాస్టిక్ సీసాలను వేస్తున్న సిబ్బంది

వన్యప్రాణులకు ముప్పు..

ప్లాస్టిక్ కవర్లు, నీటి సీసాలను అడవిలో పడేయడంతో వన్యప్రాణులు, నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా తిన్న వన్యప్రాణులు మృత్యువాత పడే అవకాశం ఉంది. నేల, నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం కూడా ఉంది.

చెక్‌పోస్టు వద్దే అడ్డుకట్ట..

నల్లమల గుండా ప్రముఖ పుణ్యక్షేత్రాలు శ్రీశైలం, మద్దిమడుగుకు నిత్యం వందలాది వాహనాలు అటవీ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. భక్తులు ప్లాస్టిక్ సీసాల్లో నీటిని తీసుకెళ్తుంటారు. వాటిని మన్ననూరు చెక్‌పోస్టు వద్ద సిబ్బంది సేకరిస్తున్నారు. ప్లాస్టిక్ నీటి సీసాల విక్రయాన్ని నల్లమలలో నిషేధించారు. ప్లాస్టిక్ సీసాలు, కవర్లను సేకరించేందుకు 16 మంది వాచర్లను నియమించారు. వీరు నిత్యం సుమారు 5 సంచుల చెత్త, నీటి సీసాలను సేకరించి బెయిలింగ్ కేంద్రానికి తరలిస్తున్నారు.

కిలో రూ.10 చొప్పున విక్రయం:

సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను మన్ననూరు బెయిలింగ్ కేంద్రానికి తరలిస్తారు. ప్రత్యేక యంత్రంతో వాటిని బెయిళ్లుగా మార్చి నిల్వ చేస్తున్నారు. గత రెండేళ్లలో ఒక్కొక్కటి సుమారు 30 కిలోల బరువుండే 345 ప్లాస్టిక్ బెయిళ్లను విక్రయించారు. కిలో ప్లాస్టిక్‌ను సగటున రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు.

రైతు వేదికలకు సౌర వెలుగులు

భవనాల పరిస్థితిపై నివేదిక కోరిన ప్రభుత్వం

అయిజ, న్యూస్‌టుడే: రైతు వేదికలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా సౌర పలకల ఏర్పాటుకు అనుమతించింది. వీటిని అమర్చేందుకు ప్రభుత్వ రంగ సంస్థ హైదరాబాద్ వ్యవసాయ సహకార సంఘాని (హాకా)కి బాధ్యతలు అప్పగించింది. జిల్లాల వారీగా రైతు వేదికల పరిస్థితిపై నివేదిక అందజేయాలని ప్రభుత్వం కోరింది. జిల్లా వ్యవసాయాధికారులు నివేదిక తయారీలో నిమగ్నమయ్యారు.

నిర్వహణ లోపంతో.. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో చాలా రైతు వేదికలు అధ్వానంగా మారాయి. తలుపులు, కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. మెట్లు, ర్యాంపులు పగుళ్లిచ్చాయి. కొన్నిచోట్ల ముళ్ల చెట్లు పెరిగాయి. నిర్వహణకు నిధులు మంజూరు కాకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో 472.. గత ప్రభుత్వం క్లస్టర్లను ఏర్పాటు చేసి రైతు వేదికలు నిర్మించింది. ఒక్కో వేదికను రూ.22 లక్షలతో నిర్మించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 472 రైతు వేదికల నిర్మాణాలకు రూ.103.84 కోట్లు వెచ్చించారు.

రక్షణ లేక చోరీలు.. వేదికలకు రక్షణ లేకపోవడంతో రాత్రిళ్లు చోరీలు జరుగుతున్నాయి. చాలా చోట్ల ఎలక్ట్రిక్ పరికరాలు, బ్యాటరీలు, విలువైన వస్తువులు తదితరాలు చోరీ చేశారు. దొంగతనాలను అరికట్టడానికి ఇప్పటికైనా సౌర విద్యుత్తు కంచె ఏర్పాటు చేయాలని రైతులు, వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

జిల్లా	రైతు వేదికలు
గద్వాల	94
మహబూబ్‌నగర్	88
నాగర్‌కర్నూల్	142
నారాయణపేట	77
వనపర్తి	71

నీటి వసతి కరవై.. కనీసం నీటి వసతి కూడా లేకపోవడంతో రైతులు, వ్యవసాయశాఖ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. వేదికలను శుభ్రం చేసేందుకు, సమావేశాలకు కుర్చీలు వేసేందుకు స్వీపర్లు లేరు. అన్నీ ఏఈవోలే చూసుకుంటున్నారు.

CHANGE OF NAME

I, Jangaiah G S/o G Buchiah, R/o H.No: 7-188, Subhashnagar, Kalwakurthy Village and Mandal, Nagarkurnool Dist. Telangana., Do hereby declare that I have changed My Name as GAYALA RAMU

అధిక సాంద్రత సాగుకు అడ్డంకులే

కల్వకుర్తి, న్యూస్‌టుడే: పత్తి దిగుబడిని సాధించి.. రైతు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంచుకొన్న అధిక సాంద్రత సాగు విధానానికి ఆదిలోనే బ్రేక్ పడింది. కేంద్రం జాతీయ పత్తి ఉత్పాదక మిషన్ కింద అధిక సాంద్రత పద్ధతి ద్వారా పంట సాగుకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేసింది. పత్తి విత్తనాలతో పాటు, పైరు ఎదిగే సమయంలో పురుగు నివారణ మందులను, రాయితీ పద్ధతిలో అందించి రైతులకు అండగా నిలవాలని భావించింది.

మార్చాలలో సాగు చేసిన పత్తి

పత్తి విత్తనం పంపిణీకి సమయం దాటిపోవడంతో రైతులు వాటిని పేరుకు మాత్రమే తీసుకున్నట్లయ్యింది. పంటపొలాల్లో ముందుగా సాగు చేసిన పత్తి పైర్ల మధ్యలో మొక్కలు లేని చోట విత్తారు. మరి కొందరు విత్తడానికి ఆలస్యమైందని, అధికారులు పంపిణీ చేసినవి సైతం వెనక్కి ఇచ్చారు. అధికారుల ఒత్తిడికి రైతులు అక్కడక్కడ అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేపట్టారు. రాష్ట్రంలోని 17 జిల్లాలను కపాస్ క్రాంతి పథకం కింద ఎంపిక చేసి...ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నాగర్‌కర్నూల్ జిల్లాకు 72950 ప్యాకెట్ల విత్తనాలు సరఫరా చేశారు.

రైతులకు ఆసక్తి ఉన్నా..

జిల్లాలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని భావించిన రైతులకు, ప్రభుత్వం ద్వారా పత్తి విత్తనాల పంపిణీ విషయం నేటికీ తెలియదని, కల్వకుర్తి మండలం ఎలికట్టకు చెందిన కుమ్మరి రమేశ్, తోటపల్లికి చెందిన సాయిరెడ్డి చెప్పారు. అధిక సాంద్రత సాగుపై అధికారులు రైతుల్లో అవగాహన కల్పించడం లేదన్నారు. గ్రామాలకు పత్తి విత్తనాలు తెచ్చిన ఏఈవోలు కూడా వారికి అనుకూలంగా ఉన్న వారికే ఇచ్చి...మిగిలినవి వ్యవసాయ కార్యాలయాల్లో ఉంచారనే విమర్శలు ఎక్కువవుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో 2025లో 6లక్షల 31 వేల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు అంచనా. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2026లో 2.54 లక్షల ఎకరాల్లో సాగు చేపట్టగా...ఇప్పుడు కేవలం 1.20 వేల ఎకరాల్లోనే సాగు చేశారు. అధిక సాంద్రత సాగు విధానంలో ప్రభుత్వం 72950 ప్యాకెట్లు సరఫరా చేయగా...రైతులకు 50952 ప్యాకెట్లు మాత్రమే పంపిణీ చేశారు. వాటిని తీసుకొన్న కొందరు రైతులు విత్తకుండానే ఇంట్లో దాచేశారు. అధికారుల వద్ద ఇంకా 7086 ప్యాకెట్లు మిగిలి ఉండటం గమనార్హం.

(c) eenadu

గుంత తవ్వి.. మరమ్మతులు మరిచి

పట్టణంలోని చేపల మార్కెట్‌కు వెళ్లే దారిలో మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం అయిదు రోజుల క్రితం గుంత తవ్వి పనులు పూర్తి చేయలేదు. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు పూర్తి చేసి గుంతను పూడ్చాలని, అప్పటి వరకు భద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెబ్బేరు పట్టణం**

పట్టు వీడకు.. ప్రమాదానికి చోటివ్వకు

మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేట వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. ఉదయం, సాయంత్రం బస్సులు సరిపడా లేకపోవడం, ఉన్నా అందులో నిల్చోవడానికి స్థలం దొరకకపోవడంతో ఫుట్‌బోర్డులపైనే ప్రమాదకరంగా నిలబడి ప్రయాణం సాగిస్తున్నారు. ఏ మాత్రం అదుపుతప్పినా పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పాలమూరు నగరంలో సోమవారం తీసిన చిత్రమిది. **- న్యూస్‌టుడే, నవాబ్‌పేట, కార్పొరేషన్**

సస్యరక్షణతో వేరుసెనగలో అధిక దిగుబడి

మదనాపురం, న్యూస్‌టుడే : జిల్లాలో ఆయా ప్రాంతాల్లో రైతులు ఆరుతడి పంట కింద యాసంగిలో వేరుసెనగ సాగు చేస్తారు. కలుపు, చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త, కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. టీఏజీ 24, కదిరి 6, కదిరి 9, లేపాక్షి హరితాంధ్ర, ధరణి, జేల్ 24, జగిత్యాల పల్లీ 1, టీసీజీఎస్ 1694, గిర్‌నారు-3 గిర్‌నారు-4 అధిక దిగుబడికి అనువైన రకాలని పేర్కొన్నారు. సెప్టెంబరు రెండో వారం నుంచి నవంబరు మొదటి వారం వరకు విత్తనాలు విత్తుకోవచ్చు. 22 సెం.మీ.× 10 సెం.మీ. దూరంలో ఎకరాకు 4.4 లక్షల మొక్కలు ఉండేలా చూసుకోవాలని సూచించారు.

కొన్నూరులో సాగైన వేరుసెనగ

విత్తనశుద్ధి : టెబ్యుకోనోజోల్ 2డీఎస్ మందును ఒక గ్రాము లేదా మ్యాంకోజోబ్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకొని ఆపై ట్రైకోడర్మా 10 గ్రా., అనంతరం రైజోబియం 5 గ్రా. విత్తనం వేసే 2 గంటల ముందు కలిపి విత్తుకోవాలి.

పోషకాల యాజమాన్యం: భాస్వరం, పొటాష్ ఎరువులను విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఎకరానికి 100 కిలోల సూపర్ పాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేసుకోవాలి. పంట పూత, ఊడలు దిగే సమయంలో 200 కిలోల జిప్సం మొదళ్ల దగ్గర వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో ఎకరానికి 10 లేదా 12 కిలోల యూరియా చల్లాలి.

కలుపు పద్ధతి.. : విత్తిన వెంటనే లేదా 2 రోజుల లోపు కలుపు నివారణకు అలాక్లోర్ ఒక లీటరు లేదా పెండిమిథాలిన్ 1.3 లీటరు ఎకరానికి 200 లీటర్ల నీటిని కలిపి నేలపై పిచికారీ చేయాలి. గడ్డిజాతి మొక్కలు అధికంగా ఉంటే నివారణకు క్విజలోఫాప్.పి.ఇథైల్ ఎకరాకు 400 మి.లీ. లేదా ప్రోపాక్విజఫాస్.పి.ఇథైల్ ఎకరాకు 250 మి.లీ. విత్తిన 20 రోజుల వరకు పిచికారీ చేసుకోవచ్చు. వెడల్పాకు, గడ్డిజాతి కలుపు 2, 3 ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజిథపైర్ 10 శాతం ఎకరాకు 300 మి.లీ లేదా ఇమాజామాక్స్+ఇమాజిథపైర్ 40 గ్రాముల కలుపు మందు ఎకరానికి 200 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడలు.. : రసం పీల్చు పురుగు నివారణకు ఫ్రిపోనిల్ 2 మి.లీ. లేదా థయోమిదాక్సామ్ 0.4 గ్రా. లేదా ఇమిడాక్లోఫిడ్ 0.3 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దెపురుగు నివారణకు మొదటిదశలో 5 మి.లీ. వేప మందు (ఎన్ఎస్‌కేఈ)ను క్లోరోపైరిఫాస్ 50 ఈసీ 1.5 మి.లీ. లేదా న్యూవులురాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా ఎసిపేట్ 1.5 గ్రా. మందులను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. టిక్కా ఆకుమచ్చ, కాండం కుళ్లు నివారణకు క్లోరోథానిల్ 2 గ్రా. లేదా హెక్సాకోనాజోల్ 2 మి.లీ. లేదా టెబ్యూకోనోజోల్ 1 మి.లీ. లేదా టెబ్యూకోనోజోల్+ ట్రైఫ్లాక్సిస్ట్రెబిన్ ఒక గ్రాము మందును ఏదైనా ఒకటి లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

ఆర్టీసీలో అవిశ్రాంత పోరాటం!

- ప్రయోజనాలు అందక ఏళ్లుగా నిరీక్షణ
- ఆర్థిక ఇబ్బందుల్లో అల్లాడుతున్న వైనం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పది ఆర్టీసీ డిపోల పరిధిలో ప్రతి నెలా సగటున 25 నుంచి 30 మంది (డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఇతర సిబ్బంది) ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వీరికి నెలలు గడుస్తున్నా విశ్రాంత ప్రయోజనాలు అందడం లేదు. ఒక్కో ఉద్యోగికి సగటున రూ.20 లక్షలకు పైబడే అందాల్సి ఉంది. ఈ డబ్బులు చేతికి ఎప్పుడు అందుతాయోనని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు మహబూబ్‌నగర్‌లోని ఆర్ఎం కార్యాలయం చుట్టూ రోజూ చెప్పులరిగేలా తిరుగుతుంటారు.

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీలో ఉద్యోగ విరమణ పొందిన వారిని కుటుంబ సభ్యులు ఓ విషయంలో ఎప్పుడూ తప్పుబడుతుంటారు. ఏ కాస్త సమయం దొరికినా డిపోల వద్దకు చేరి ఆర్టీసీ బాగోగుల గురించి ఎందుకు చర్చిస్తుంటారని ప్రశ్నిస్తుంటారు. విశ్రాంత జీవితంలోనూ సంస్థ గురించి తపన పడే వారిప్పుడు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు దక్కక కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది.

ఉచిత పథకాల పుణ్యమా అంటూ..: ప్రభుత్వాలు ఉచిత పథకాలు అమలు చేస్తున్న కారణంగా బడ్జెట్ లేక ఆయా ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగ విరమణ చేసే తమకు సకాలంలో ప్రయోజనాలను ఇవ్వలేకపోతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి ఆర్టీసీలోనే కాదూ ప్రతి శాఖలోనూ ఎదురవుతోందంటున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసిన వారికి మూడు నుంచి ఆరు మాసాల్లోగా రిటైర్డ్ బెనిఫిట్స్ వచ్చేవి. ఆ తర్వాత ఈ గడువు ఏడాదికి పెరిగింది. కాలక్రమేణా ఇది రెండు నుంచి మూడేళ్లకు చేరడంతో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.

సర్వీసు నిబంధనల ప్రకారం: ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసే వారికి వారం ముందే ప్రయోజనాలు (పీఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ, పీఆర్సీ ఎరియర్స్) ఖాతాల్లో జమ చేయాలి.

కుమార్తె పెళ్లికి అప్పు చేశా

2024 నవంబర్‌లో ఆర్టీసీ గద్వాల డిపోలో ఏడీసీ కంట్రోలర్‌గా ఉద్యోగ విరమణ చేశా. 20 మాసాలు గడుస్తున్నా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదు. రూ.20 లక్షలకు పైగా నాకు రావాలి. చేతిలో డబ్బు లేకపోవడంతో అప్పు చేసి కుమార్తె పెళ్లి చేయడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఆర్ఎం కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. **- కె.సుధాకర్‌రెడ్డి, విశ్రాంత కంట్రోలర్, పుట్టపల్లి**

పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలున్నారు.. కనికరించాలి

మహబూబ్‌నగర్ డిపోలో ఐదు నెలల కిందట ఉద్యోగ విరమణ చేశా. 2017, 2021 సంవత్సరాల పీఆర్సీ బకాయిలతో పాటు డీఏ ఎరియర్స్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు రావాల్సి ఉంది. ఇద్దరు అమ్మాయిల పెళ్లిళ్లు చేద్దామని భావిస్తే ఇంత వరకు ఆర్టీసీ నుంచి ప్రయోజనాలు రావడం లేదు. కుటుంబ పోషణ భారంగా ఉంది. విశ్రాంత ఉద్యోగులపై కక్ష సాధించకుండా వెంటనే ఇవ్వాలి. **- ఎస్.సుగుణమ్మ, విశ్రాంత కండక్టర్**

రూ. 20 లక్షల వరకు రావాలి

మహబూబ్‌నగర్ డిపోలో డ్రైవర్‌గా చేస్తూ ఉద్యోగ విరమణ చేశా. రూ.20 లక్షల వరకు ప్రభుత్వం నుంచి రావాలి. ఇప్పుడు అప్పుడంటూ ఎదురుచూడటం తప్ప ఇవ్వడం లేదు. అప్పు చేసి బిడ్డ పెళ్లి చేశా. అప్పుల వాళ్లు ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నా. **- కె.శ్రీనివాసులు, విశ్రాంత డ్రైవర్**

సాగులో.. సమస్యలా?

బిజినేపల్లి, న్యూస్‌టుడే : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11-12 గంటల మధ్య చరవాణి నంబరు 99514 61694ను సంప్రదిస్తే సందేహాలు నివృత్తి చేస్తామని కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డా.శైల తెలిపారు.

పశువుల పేడ ఎంత వాడాలి?

మీ కోసం

హన్వాడ, న్యూస్‌టుడే : ఎకరానికి పశువుల పేడ ఎంత వాడాలో చాలా మంది రైతులకు తెలియదు. రూ.వేలు ఖర్చు చేసి ట్రాక్టర్ల కొద్దీ పొలాల్లో వేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. ఎలాంటి రసాయన మందులు చల్లని రైతులు ఎకరానికి 100 కిలోల జల్లెడ పట్టిన పశువుల ఎరువు వాడితే సరిపోతుంది. దీన్ని కల్చర్ మాదిరిగా ఉపయోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. పశువుల ఎరువును పెంటకుప్ప నుంచి తీసి ఏడు రోజుల పాటు ఆరబెట్టి జల్లెడ పట్టాలి. వానాకాలం, యాసంగిలో విత్తనాలు విత్తేటప్పుడు వేసుకుంటే సరిపోతుంది. దీంతో పాటు పొడిగా ఉండే ఘనజీవామృతాన్ని కలిపి విత్తుకోవచ్చు.

పురుగుల నివారణలో జిగురు అట్టల పాత్ర కీలకం

బిజినేపల్లి, న్యూస్‌టుడే : లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు ఉపయోగించి ఎరువుల వినియోగం తగ్గిస్తూ, పంటకు హాని చేసే కీటకాలు, కాయతొలిచే పురుగును అరికట్టవచ్చని కేవీకే కీటక శాస్త్రవేత్త డా.శైల తెలిపారు.

ఇలా చేయాలి.. : అన్ని రకాల పంటలకు ఆశించే పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక పురుగులను పసుపురంగు అట్టలు ఆకర్షిస్తాయి. ముఖ్యంగా కూరగాయల పంటల సాగులో వీటిని వినియోగించవచ్చు. ఎకరానికి 20-25 అమర్చుకోవాలి. వివిధ రకాల పంటలకు ఆశించే ఎర్ర నల్లి, తెల్ల నల్లి, తామర పురుగు నివారణకు నీలి రంగు అట్టలు వాడవచ్చు. ఎకరానికి 20 -25 అమర్చుకోవాలి. తెలుపు రంగు జిగురు అట్టలను రసం పీల్చే పురుగులు, తామర పురుగు నివారణకు వాడవచ్చు. ఎకరానికి 20-25 అమర్చుకోవాలి

లింగాకర్షక బుట్టలు : కాయ తొలుచు పురుగుల నివారణకు వీటిని వాడతారు. వీటి వల్ల మగ పురుగులు ఆకర్షితమై, సంతతి గణనీయంగా తగ్గుతుంది. వీటిని ప్రతి 21 రోజులకు ఒకసారి మార్చడం వల్ల మగ పురుగులను ఆశించే సామర్థ్యం పెరుగుతుంది. ● పురుగుల ఉద్ధృతిని గమనించడానికి ఎకరానికి 4-5 బుట్టలు అమర్చుకోవాలి. 10-20 బుట్టలు అమర్చుకోవడం ద్వారా కొంత మేర పురుగును నివారించవచ్చు. 50-60 శాతం నివారణకు లేదా పరాగసంపర్కాన్ని నిరోధించడానికి ఎకరానికి 100-120 బుట్టలు అమర్చుకోవాలి. పంటల ఎత్తు పెరిగే కొద్దీ వీటి ఎత్తు పెంచుకోవాలి.

రైతేరాజు

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? **- శివకుమార్, పెబ్బేరు**

✔ నారు నాటిన 15 రోజుల తర్వాత ఎకరానికి 4 కిలోల క్లోరాంట్రనిలిప్రోల్ గుళికలు వేయాలి.

? కందిలో ఆకులపై పురుగులు గూడు పెడుతున్నాయి. వాటి ఎలా నివారించాలి? **- నిరంజన్ యాదవ్, చేగుంట**

✔ కందిలో ఆకుగూడు నివారణకు 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఆకు గూడును అరికట్టవచ్చు.

? జొన్నలో మొవ్వ తొలుచు పురుగు ఆశించింది. నివారణ ఎలాంటి చర్యలు చేపట్టాలి? **- రామాంజనేయులు, మమ్మాయిపల్లి**

✔ జొన్న శాఖీయ దశలో మొవ్వతొలుచు పురుగును గమనిస్తే 1.0 మి.లీ. సైపర్‌మెత్రిన్ ద్రావణానికి లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి.

(కేవీకే కీటక శాస్త్రవేత్త డా.శైల సమాధానాలిచ్చారు)

- న్యూస్‌టుడే, బిజినేపల్లి

మా డబ్బు మాకు ఇప్పించండి సార్..

సోషల్ మీడియాలో ప్రకటన చూసి మోసపోయాం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: స్క్రబ్ ఎక్స్ పేరుతో రమేష్ అనే వ్యక్తి, మరికొందరు మోసం చేసి డబ్బు తీసుకుని బోర్డు తిప్పేశారు.. ఈ కేసులో నిందితుడు తిరుమలకొండ రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు.. అతడి నుంచి తమకు రావాల్సిన డబ్బు ఇప్పించాలని మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, శ్రీ సత్యసాయిజిల్లా, అనంతపురం, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు చెందిన స్క్రబ్ ఎక్స్ బాధితులు విన్నవించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లెలో సోమవారం నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌లో ఎస్పీ ధీరజ్‌కు వారు ఫిర్యాదు చేశారు.. తాము సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటన చూసి మోసపోయామని వాపోయారు. డబ్బు కట్టామని నిందితుడితో పాటు సంబంధిత పోస్టు పెట్టిన సోషల్ మీడియా నిర్వాహకులపైనా చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

అర చేతిలో పల్లె ప్రగతి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఏ సమాచారమైనా ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా 'జీపీ ప్రొఫైల్' (జీపీఎస్ఏపీ) అనే వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చాయి. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల సమగ్ర సమాచారాన్ని అభివృద్ధి పనులు, ప్రణాళికలను పారదర్శకంగా నిర్వహించడానికి ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. పంచాయతీకి సంబంధించిన ప్రతి అంశాన్ని డిజిటలైజ్ చేశారు. ఈ పోర్టల్‌లో పల్లెలకు సంబంధించిన పూర్తి వివరాలు చూడటానికి చరవాణి లేదా అంతర్జాలంలోని గూగుల్ క్రోమ్‌ను తెరిచి https://gpsap&prrd.telangana.gov.in/gpprofile లింక్‌ను ఓపెన్ చేయాలి.

జిల్లాల వారీగా పంచాయతీల వివరాలు

వనపర్తి	268
మహబూబ్‌నగర్	423
నాగర్‌కర్నూలు	460
నారాయణపేట	272
జోగులాంబ గద్వాల	255

వెబ్ పేజీలో సమగ్ర సమాచారం: పేజీని తెరిచిన వెంటనే జిల్లా, మండలం, పంచాయతీ కోడ్ నమోదు చేస్తే అందులో ప్రజాప్రతినిధులు, కార్యదర్శి వివరాలతో పాటు పంచాయతీలో ఉన్న జనాభా (స్త్రీ, పురుషులు), గృహాల సంఖ్య పొందుపరిచారు. వీటితో పాటు సీసీ రహదారులు, మురుగు కాల్వలు, వీధి దీపాలు, తాగునీటి కనెక్షన్లు, డంపింగ్ యార్డు, వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్, ట్రాక్టర్ లభ్యత, పంచాయతీ అధీనంలో ఉన్న భవనాలు, స్థలాలు, కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధుల వినియోగం, తదితర అంశాలను వెబ్ పేజీలో అందుబాటులో ఉన్నాయి.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం

పీయూ వీసీ శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే: అధ్యాపకులు, సిబ్బంది నిత్యం ఏదో ఒక క్రీడ ఆడుతూనే ఉండాలని, అప్పుడు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు స్థానిక పీయూలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి పలు క్రీడాపోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల మధ్య స్నేహభావం, సమన్వయం పెంపొందడానికి ఇటువంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సూచించారు. ఈ క్రీడా పోటీలు సోమవారం నుంచి గురువారం వరకు జరుగుతాయన్నారు. వీసీ, ఓఎస్డీ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో వీసీ జట్టు 60 పరుగుల తేడాతో గెలుపొందింది. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, పీడీ శ్రీనివాసులు, పలు విభాగాల అధ్యాపకులు నాగం కుమారస్వామి, రాజ్‌కుమార్, ఈశ్వర్‌కుమార్, రవికుమార్, అర్జున్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాస్, గాలెన్న, సుస్మిత, చిన్నాదేవి, ప్రభాకర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, రంగప్ప పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతున్న వీసీ జీఎన్ శ్రీనివాస్

316 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు(అమరచింత), న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి వరద రావడంతో సోమవారం 8 టర్బయిన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టారు. ఎగువన 4, దిగువన 4 యూనిట్లలో 316 మెగావాట్ల ఉత్పత్తి జరిగిందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. పవర్ హౌస్ ద్వారా 21,324 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ సమాచారం

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం ఉదయం 6.00 గంటలకు, జోగులాంబ అమ్మవారి ఆలయం ఉదయం 6.30కు తెరుస్తారు. స్వామి వారి ఆలయంలో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, ఉదయం 9 నుంచి 11 గంటలకు రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, 11.30 నుంచి 12 గంటల వరకు నివేదన, మహా మంగళహారతి ఉంటాయి. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు ఆలయాలు మూసివేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, రాత్రి 7.30 గంటలకు మహా మంగళహారతి. జోగులాంబ ఆలయంలో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు త్రిశతి అర్చన, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఖడ్గమాల అర్చనలు కొనసాగుతాయి. రాత్రి 7కు మహా మంగళహారతి అనంతరం రాత్రి 8.30 గంటలకు ఆలయాలు మూసివేస్తారు.

గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్టు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గద్వాల జిల్లా కేంద్రంలో ఆదివారం తొలిసారి పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడిన విషయం తెలిసిందే. సోమవారం డీఎస్పీ మొగులయ్య పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ శ్రీనుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఇటిక్యాల మండలానికి చెందిన బోయ బీసన్న(50), మల్దకల్ మండలానికి చెందిన తనగల గోకారి (29) గంజాయిని సరఫరా చేస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో వారిని పట్టుకొని 5.057 కేజీల 10 ప్యాకెట్ల గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఇద్దరు తమ భూముల్లో పంటల సాగుతో పాటు గంజాయి మొక్కలు పెంచి వాటిని ఎండబెట్టి గద్వాల, ఎర్రవల్లి, కొత్తకోట ప్రాంతాల్లో విక్రయించేందుకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై గద్వాలకు వస్తున్నారన్న సమాచారంతో పట్టుకున్నట్లు వివరించారు. ఇద్దరిపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొగులయ్య

ఎస్సైని సస్పెండ్ చేయాలని భాజపా ధర్నా

ఎస్పీ కార్యాలయానికి ఎస్సై అటాచ్

కోడేరు, న్యూస్‌టుడే: యువకుణ్ని ఠాణాకు పిలిపించి ఎస్సైతో పాటు నలుగురు కానిస్టేబుళ్లు కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో చోటుచేసుకున్న పరిణామాలు కోడేరు ఎస్సైని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసేవరకు వెళ్లాయి. బాధితుడితో పాటు భాజపా నేతలు, గ్రామస్థులు సోమవారం ధర్నా నిర్వహించడంతో మండల కేంద్రంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బాధితుడు, గ్రామస్థుల కథనం ప్రకారం. . మండలంలోని ఠాకూర్‌తండాకు చెందిన డా.పరమేశ్వర్, నార్యానాయక్‌తండాకు చెందిన పాండునాయక్ వ్యక్తిగతంగా సోషల్ మీడియాలో విమర్శలు చేసుకున్నారు. దీంతో పాండునాయక్ కోడేరు ఠాణాలో పరమేశ్వర్‌పై ఫిర్యాదు చేశారు. పరమేశ్వర్‌ను ఆగస్టు 28న విచారణకు ఠాణాకు పిలిపించి ఎస్సై వేణుగోపాల్, కానిస్టేబుళ్లు కొట్టారు. గాయపడిన బాధితుడు తండా ప్రజలు, భాజపా నాయకుడు ఎల్లేని సుధాకర్‌రావుకు మొరపెట్టుకున్నారు. అంతకు ముందే డీజీపీకి ఫిర్యాదు చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా సోమవారం భాజపా నాయకులతో ఠాణాకు పాదయాత్రగా వెళ్లారు. కొల్లాపూర్ సీఐ శంకర్, ఎస్సై, సిబ్బందితో వారిని అడ్డుకోగా రోడ్డుపై బైఠాయించారు. ఈ విషయంలో 'న్యూస్‌టుడే' డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్‌ను వివరణ కోరగా ఎస్సై వేణుగోపాల్‌పై గతంలోనే పలు ఆరోపణలు వచ్చాయన్నారు. తాజా ఆరోపణలతో ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు వివరించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కొల్లాపూర్ సీఐ శంకర్.. కోడేరు ఠాణా బాధ్యతలు చూస్తారని, త్వరలోనే మరో ఎస్సైని నియమిస్తామన్నారు.

కేసుల దర్యాప్తును వేగవంతం చేయండి

మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం

భూత్పూర్, న్యూస్‌టుడే: పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం సూచించారు. భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ జానకితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఠాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సిబ్బందిని అప్రమత్తం చేయాలని అన్నారు. వివిధ ఠాణాల దస్త్రాలు పరిశీలించి నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల నియంత్రణకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్సైలు పాల్గొన్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం, ఎస్పీ జానకి

ఎయిడ్స్ నియంత్రణకు సమష్టి కృషి

పాలమూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించడానికి సమష్టి కృషి అవసరమని, లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జేడీ డా.జయలక్ష్మి వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు పలు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమణ నివారణ (పీపీటీసీటీ) సేవలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ బాధితులు మహబూబ్‌నగర్ జీజీహెచ్‌లోని ఏఆర్‌టీ సెంటర్‌కు వస్తున్నారని, వారికి నాణ్యమైన వైద్యసేవలతో పాటు సలహాలు, సూచనలు అందించాలన్నారు. జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, కుష్ఠు విభాగ అధికారి రాజు, డా.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జేడీ జయలక్ష్మి

EENADU e Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

మహబూబ్‌నగర్ భగీరథకాలనీ నర్సరీ బజార్ మినీ అపార్ట్‌మెంట్ నందు 66 గజాల ఈస్ట్ ఫేస్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్రః 9704209449

JOBS

Required Female Typist for Jaya Diagnostic Centre, Club Road, Jadcherla, Behind M.R.O office, fast typing skills required English Language, Salary as per experience.... Jaya Diagnostic Centre, Club Road, Jadcherla. Contact Number : 99665 02502

Book Your 5 Lines Classified Advertisement for
B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact : Mahabubnagar 8008709794

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001824

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు
నాగర్‌కర్నూలు : 7993300530
అచ్చంపేట : 8008573927
కల్వకుర్తి : 8008573884
కొల్లాపూర్ : 8008573870

కందనూలు: ?: పట్టణంలోని సంతబజార్ కాలనీలో కొన్ని రోజులుగా కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. రాత్రివేళ దోమల బెడద తీవ్రంగా ఉంది. -**వెంకటయ్య, నాగర్‌కర్నూల్** ✔: కాల్వలు శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ?: పట్టణంలోని వివేకానంద కాలనీలో పలుచోట్ల విద్యుత్తు స్తంభాలకు బిగించిన ఎల్‌ఈడీలు మరమ్మతులకు గురయ్యాయి. -**మహేశ్, నాగర్‌కర్నూల్** ✔: దీపాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. **(కమిషనర్ నాగిరెడ్డి సమాధానం ఇచ్చారు.)** కల్వకుర్తి: ?: పుర పరిధిలోని రాఘవేంద్ర కాలనీ చివరి ఇళ్లకు రోడ్ల సౌకర్యం కల్పించాలి. -**యాదయ్య, రాఘవేంద్ర కాలనీ, కల్వకుర్తి** ?: పుర పరిధిలోని భగత్‌సింగ్ కాలనీలో మట్టిరోడ్లకు మరమ్మతులు చేపట్టాలి. -**బాలయ్య, భగత్‌సింగ్ కాలని** ?: విద్యానగర్ శివారు కాలనీలో కాలువలను ఏర్పాటు చేయాలి. -**రాఘవేందర్, విద్యానగర్ కాలని** ✔: అన్ని కాలనీల సమస్యలు పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **(పై ప్రశ్నలకు కల్వకుర్తి పుర కమిషనరు మహమూద్ షేఖ్ సమాధానాలిచ్చారు.)** అమ్రాబాద్, న్యూస్‌టుడే: ?: మండలంలోని కుమ్మరోనిపల్లెలో వీధి దీపాలు లేక రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నాం. సమస్య పరిష్కరించాలి. - **కుందేళ్ల మహేశ్, కుమ్మరోనిపల్లె** ✔: సర్పంచి ఎన్నికలు జరగనందున నిధులు రావడం లేదు. ఇంటి పన్నులు వసూలు చేయించి వీధి దీపాలు ఏర్పాటుచేసేలా కార్యదర్శిని ఆదేశిస్తాను. -**రామన్న, ఎంపీడీవో ప్రత్యేకాధికారి, కుమ్మరోనిపల్లె** అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని న్యూ వెంకటేశ్వర కాలనీకి చెత్త సేకరణ ఆటోలు రావడం లేదు. ఇళ్ల వద్ద చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. చర్యలు తీసుకోవాలి. -**ప్రభాకర్, కాలనీవాసి.** ✔: సకాలంలో ఆటోలను పంపించేందుకు చర్యలు తీసుకుంటాం. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా సహకరించాలి. -**గణేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, అచ్చంపేట**

విద్యార్థుల్లో సమగ్ర వికాసం

స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాల ఏర్పాటుకు నిధులు

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సేవాభావం, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలల్లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహిస్తోంది. గతేడాది నుంచి కొన్ని పాఠశాలల్లో అమలు చేస్తుండగా, మంచి ఫలితాలు రావడంతో.. తాజాగా మరికొన్ని బడుల్లో అమలు చేసేందుకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెలలోనే బృందాలను ఏర్పాటు చేసి, అమలుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సమగ్ర శిక్షా నుంచి ఆదేశాలందాయి.

రాజోలి కేజీబీవీలో మొక్కలు నాటేందుకు గుంత తవ్వుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినులు

రూ.3.94 కోట్లు.. : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,227 ప్రభుత్వ పాఠశాలలుండగా, ఇప్పటికే 78 కస్తూర్బాల్లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం అమలవుతోంది. ఈ ఏడాది నుంచి 115 పీఎంశ్రీ పాఠశాలల్లో, 156 సాధారణ పాఠశాలల్లో అమలుకు చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు ఒక్కో పీఎంశ్రీ పాఠశాలకు రూ.2.50 లక్షలు చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.2.87 కోట్లు, సాధారణ పాఠశాలలకు రూ.69 వేలు చొప్పున రూ.1.07 కోట్లు మంజూరయ్యాయి. విద్యార్థులకు అవసరమైన ప్రత్యేక యూనిఫామ్స్ అందించడంతో పాటు, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పించనున్నారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులకు త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లా	జడ్పీ పాఠశాలలు	నిధులు (రూ.లక్షల్లో)	పీఎంశ్రీ పాఠశాలలు	నిధులు (రూ.లక్షల్లో)
జోగులాంబ	45	31.05	22	55
మహబూబ్‌నగర్	40	27.60	26	65
నాగర్‌కర్నూల్	20	13.80	27	67.50
నారాయణపేట	37	25.53	19	47.50
వనపర్తి	14	9.66	21	52.50

నిర్వహించే కార్యక్రమాలు..

- **మానసికంగా.. :** విద్యార్థుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి తోడ్పడుతుంది.
- **సేవా దృక్పథం :** సమాజంలో తోటి వారికి సహాయ పడటం, బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడం, పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యేలా నేర్పిస్తారు.
- **శిక్షణ శిబిరాలు :** విపత్తుల సమయంలో చేయాల్సిన పనులు, ప్రథమ చికిత్స వంటి వాటిపై శిక్షణ ఇస్తారు.
- **అవుట్ డోర్ క్యాంపులు :** ప్రకృతిని పరిశీలించడం, బృందంగా పని చేయడం, నాయకత్వ లక్షణాలు ఎలా అలవరచుకోవాలో నేర్పిస్తారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

లింగాల: మండలంలోని అప్పాయిపల్లి వెళ్లే దారిలో చిన్న వాగుపై వంతెన పనులు అసంపూర్తిగా వదిలేశారు. రెండేళ్ల కిందట రూ.90 లక్షలు మంజూరు కాగా గుత్తేదారు పనులు ఆపుచేశారు. వంతెనకు ఇరువైపులా గోడల నిర్మాణం, సీసీ పనులు చేయలేదు. వంతెనకు అనుసంధానంగా ఇసుక వేసి వదిలేయడంతో వాహనదారులు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. - **న్యూస్‌టుడే, లింగాల**

ఉత్సాహంగా శేషజీవితం గడపాలి

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: ఉద్యోగంలో కంటే రెట్టింపు ఉత్సాహంతో శేషజీవితం గడపాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం తిమ్మాజిపేటలోని టీజీబీసీఎల్ మద్యం గోదాం మేనేజరు శ్రీధర్ ఉద్యోగ విరమణ సభలో మాట్లాడారు. నూతనంగా డీఎం బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున్‌రావు, ఎక్సైజ్ ఎస్సై బాలీశ్వరి, గోదాం అధికారులు గంగ, సురేందర్‌రెడ్డి, మధు, వేణు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

వెల్దండ, న్యూస్‌టుడే: పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో సోమవారం వెల్దండ మండలం కొట్రకు చెందిన మహ్మద్‌కు రూ.2లక్షల ఎల్‌వోసీ అందజేశారు.

పకడ్బందీగా స్మార్ట్‌రేషన్‌కార్డు: తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: స్మార్ట్ రేషన్ కార్డు పకడ్బందీగా ఉంటుందని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం తిమ్మాజిపేటలో స్మార్ట్‌రేషన్‌కార్డులు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. అంతకుముందు బుద్దసముద్రంలో ఎల్లమ్మ ప్రతిష్ఠ, మరికల్‌లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం, ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా ఉద్యోగ విరమణ సభలో పాల్గొన్నారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గ ఎన్నిక

పదర(అమ్రాబాద్), న్యూస్‌టుడే: పదర మండలం పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆధ్వర్యంలో సోమవారం పదర మండల కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా ఆర్.నిరంజన్, ప్రధాన కార్యదర్శిగా విస్లావత్ లక్ష్మణ్, అసోసియేట్ అధ్యక్షుడిగా కొర్ర పూల్యానాయక్‌ను ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, నేతలు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి డిమాండ్

వంగూరు, న్యూస్‌టుడే: విద్య, వైద్య రంగాల్లో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింత అంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం మండల పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.

దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్

పట్టాల మార్పిడి చేయరూ!

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే: 'ప్రజావాణి'కి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో పలు ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. వారసులకు భూముల పట్టాల మార్పిడి చేయాలని లింగాల మండలంలోని ధారారానికి చెందిన చెంచులు కలెక్టర్‌ను కోరారు. కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామ శివారులో ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటును రద్దు చేయాలని వినతి పత్రం అందజేశారు. మొత్తం 64 దరఖాస్తులు వచ్చాయి.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే: భూ రీసర్వే పనులతో పాటు రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భూ-రీసర్వే, నిషేధిత జాబితా అంశాలపై సమీక్షించారు.

కందనూలు, న్యూస్‌టుడే: జిల్లా వైద్య రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు పొదిల రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ నాయకులు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

తెరపై ఈనాడు

కందనూలు: **అచ్చంపేటలో...** సాయిరాం: **టాక్సిక్**, సత్యలక్ష్మి: **ఇరుముడి, కల్వకుర్తిలో..** అశోక: **టాక్సిక్**, పార్థసారథి: **ఇరుముడి, నాగర్‌కర్నూల్‌లో...** రవి: **టాక్సిక్**

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఊర్కొండ, న్యూస్‌టుడే: విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల నేపథ్యంలో వివిధ గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని సోమవారం ఏఈ సాయన్నగౌడ్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు మండల కేంద్రంలోని విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతులు చేపడుతున్నామని ఊర్కొండ, ముచ్చర్లపల్లి, రాంరెడ్డిపల్లి, తిమ్మన్నపల్లి గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఏఈ సాయన్నగౌడ్ కోరారు.

కల్వకుర్తిలో...: కల్వకుర్తి, న్యూస్‌టుడే: కల్వకుర్తి విద్యుత్తు సబ్ డివిజన్ పరిధి తోటపల్లి విద్యుత్తు ఉప కేంద్రంలోని తోటపల్లి, వేపూర్, బెక్కర, సుద్దకల్, శ్రీరాంనగర్ గ్రామాల్లో మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్తు సరఫరాను నిలుపు దల చేస్తున్నట్లు శాఖ ఏఈ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. మరమ్మతుల కారణంగా సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

లింగాల, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ తెలిపారు. సోమవారం లింగాల రైతువేదికలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత, కొత్తరేషన్ కార్డులు ఉన్న అందరికీ స్మార్ట్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు వెంకటేష్‌కు సూచించారు. సర్పంచి ఈశ్వరమ్మ, ఎంపీడీవో విజయలక్ష్మి, నాగేశ్వర్‌రావు, వెంకటయ్య పాల్గొన్నారు.

పదర(అమ్రాబాద్), న్యూస్‌టుడే: భగవంతుని కృపాకటాక్షాలతోనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. సోమవారం పదర మండలంలోని మారడుగులో నిర్వహించిన సీతారామ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచి హన్మానాయక్, ఉపసర్పంచి శేఖర్, మద్దిమడుగు ఛైర్మన్ రాములు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

అచ్చంపేట, న్యూస్‌టుడే: ఆర్టీసీ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. సోమవారం అచ్చంపేట డిపోలో నిర్వహించిన కండక్టర్ మల్లయ్యగౌడ్ ఉద్యోగ విరమణ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.

బల్మూరు న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని తుమ్మెనపేటలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సర్పంచి పుట్ట సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు రాంప్రసాద్‌గౌడ్ తహసీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

లింగాల: స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ

లింగాల, న్యూస్‌టుడే: మండలంలోని అప్పాయిపల్లిలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ప్రారంభించారు. పోచమ్మ బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. ఉప సర్పంచి వెంకటయ్య, పర్వతాలు, కృష్ణ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బీరం జన్మదిన వేడుకలు

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను భారాస కార్యకర్తలు నిర్వహించారు. స్థానిక సర్పంచి బెట్టరి రేణుక, నాగరాజు, రవినాయక్, రమేష్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు.

కొల్లాపూర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు కొల్లాపూర్‌తో పాటు కోడేరు, నర్సాయిపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. కొల్లాపూర్‌లో ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అనాథాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. నర్సాయిపల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నరేందర్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సాయిపల్లి: రక్తదానం చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

పెంట్లవెల్లి, న్యూస్‌టుడే: పెంట్లవెల్లి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలను భారాస మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి సంబరాలు చేసుకున్నారు. రాజేష్, సురేందర్ గౌడ్, గోవురాజు తదితరులు ఉన్నారు.

'శక్తి స్కీం, జీవోనం.97ను రద్దు చేయాల్సిందే'

ఈనాడు, దిల్లీ: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న శక్తి స్కీం, జీవోనం.97ను రద్దు చేసి పాత పద్ధతిలో పాలిటెక్నిక్‌ను కొనసాగించాలని భారాస నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన దిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'రాష్ట్రంలో 80వేల మంది విద్యార్థులు 10 వేలమంది ఉపాధ్యాయులు శక్తి స్కీమ్, జీవోనం.97ను రద్దు చేయాలని ఆందోళన చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రూ.కోట్ల విలువైన పాలిటెక్నిక్ కళాశాలల భూముల్ని ప్రైవేటు వారికి ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం' అని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. భారాస నేతలు, నాయకులు పాల్గొన్నారు.

దిల్లీలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

- జనగణనలో ఓబీసీ కులగణన శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాజీ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్ ఉన్నారు.

'ప్రజావాణి'లో ఫిర్యాదుల స్వీకరణ

ఊర్కొండ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో నిర్వహించిన 'ప్రజావాణి'లో మూడు ఫిర్యాదులు వచ్చాయని ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. తహసీల్దార్ యూసుఫ్‌అలీ, ఏవో దీప్తి పాల్గొన్నారు.

వెల్దండ, న్యూస్‌టుడే: వెల్దండ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన 'ప్రజావాణి'కి రెండు ఫిర్యాదులు అందాయి. ఎంపీడీవో సులోచన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వినతులు అందించారు. తహసీల్దార్ కార్తిక్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

బిజినేపల్లి, న్యూస్‌టుడే: బిజినేపల్లి మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం 'ప్రజావాణి'కి ఏడు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో కతాలప్ప తెలిపారు.

రహదారుల మరమ్మతులకు వినతి

అచ్చంపేట, న్యూస్‌టుడే: బీటీ తేలిపోయి గోతులు ఏర్పడిన రహదారులను మరమ్మతు చేసేందుకు చర్యలు తీసుకోవాలని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు సీతరాల శివచంద్ర కోరారు. సోమవారం ఎంపీడీవో అరుంధర్‌రావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

వెల్దండ, న్యూస్‌టుడే: శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు పని చేయాలని డీఎస్పీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. వెల్దండ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం డీఎస్పీ వార్షిక తనిఖీలో భాగంగా ఠాణా పరిధిలోని పెండింగ్ కేసులు, రికార్డులను పరిశీలించారు.

రోడ్డుపై బైఠాయించి విద్యార్థుల నిరసన

లింగాల, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల కోసం తెలకపల్లి నుంచి కోమటికుంట, దత్తారం, శాయినిపేటకు నడిపిన బస్సును నిలిపివేయడాన్ని నిరసిస్తూ పాఠశాల విద్యార్థులు నిరసన చేపట్టారు. సోమవారం ఉదయం లింగాల- తెలకపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఇకపై బస్సులు నడుపుతామనే హామీతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

బియ్యాన్ని తరలించాలని ఆదేశం

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: చాలా కాలంగా వృథాగా ఉన్న బియ్యాన్ని పాఠశాల నుంచి తరలించాలని డీఆర్‌వో పాండు ఆదేశించారు. సోమవారం స్థానిక కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు.

స్థలాల మంజూరుకు విన్నపం: కందనూలు, న్యూస్‌టుడే: తాడూరు మండలంలోని భల్లాన్‌పల్లిలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.పర్వతాలు డిమాండ్ చేశారు. సోమవారం ఆపార్టీ నాయకులు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో అర్చనకు వినతి పత్రం అందజేశారు.

కొత్త నియామకాలు: వెల్దండ, న్యూస్‌టుడే: వెల్దండ మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ఎం.శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక బ్రహ్మగిరి ఆలయంలో జరిగిన సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పరమేశ్, కోశాధికారిగా రామార్జున్‌ను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రాజు తెలిపారు. యాదగిరి, గెల్వయ్య, పెద్దయ్య, అనిల్ పాల్గొన్నారు.

డీసీసీ వైద్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా...: జిల్లా కాంగ్రెస్ వైద్య విభాగం ప్రధాన కార్యదర్శిగా వెల్దండ మండలం కుప్పగండ్లకు చెందిన డా.విజయ్‌కుమార్‌ను నియమిస్తూ...సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.హరికాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయనకు నియామకపు ఉత్తర్వులు అందజేశారు.

కస్తూర్బా విద్యాలయం తనిఖీ

తాడూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సోమవారం ఆర్డీవో అర్చన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మౌలిక వసతులను పరిశీలించారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి: చారకొండ, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న 'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శంకర్ నాయక్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణిని నిర్వహించారు.

నాణ్యమైన విద్య అందించాలి: చారకొండ, న్యూస్‌టుడే: నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాను సందర్శించి మాట్లాడారు.

చదువు ఒక్కటే మార్గం: తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగాలంటే చదువుకోవడం ఒక్కటే మార్గమని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. సోమవారం తిమ్మాజిపేట పాఠశాల ఉపాధ్యాయుడు జంగయ్య ఉద్యోగవిరమణ సభలో మాట్లాడారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు జంగయ్య స్నేహితులు రూ.15వేలను అందించారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు : తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: ఆవంచకు చెందిన మహేందర్ తనపై పోలీసులు అనుచిత చర్యలకు పాల్పడ్డారంటూ సోమవారం మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. గత నెల 25న తిమ్మాజిపేట ఎస్సై తనను కొట్టడమే గాకుండా ముఖంపై మూత్ర విసర్జన చేసి నీళ్లుచల్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు దరఖాస్తులకు తుది గడువు: అచ్చంపేట, న్యూస్‌టుడే: నడింపల్లి కేజీబీవీలో స్వీపర్‌గా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో శ్రీనివాసమూర్తి సోమవారం తెలిపారు. కనీసం ఏడు లేదా పదోతరగతి ఉత్తీర్ణులైన మహిళలు దరఖాస్తుతో పాటు మార్కుల జాబితా, కుల, స్థానిక ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జత చేసి మంగళవారం సాయంత్రం వరకు కేజీబీవీ ప్రత్యేక అధికారికి అందజేయాలని సూచించారు

ఉత్తమ కోచ్ పురస్కారం: కొల్లాపూర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: మండలంలోని బోడబండ తండాకు చెందిన కేతావత్ ఉమాపతి ఉత్తమ కోచ్ అవార్డును అందుకున్నారు. తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మీర్‌పేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పురస్కారం అందుకున్నారు.

విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలి

తెలకపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గోలగుండం అనుబంధ మదనాపూర్‌లో విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలంటూ సర్పంచి ఎం.గోవర్ధన్‌రావు సోమవారం 'ప్రజావాణి'లో ఎంపీడీవో వెంకట్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డుపై స్తంభాలు అడ్డంగా ఉన్నాయని, తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని విచారం వ్యక్తం చేశారు.

వాడవాడలా ఘనంగా బోనాలు

వెల్దండ, న్యూస్‌టుడే: వెల్దండ మండలం బర్కత్‌పల్లిలో బోనాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ సందర్భంగా కుంకుమ, పసుపు, వేపాకులతో బోనం కుండలను అలంకరించి డప్పు మేళాలు, విన్యాసాలతో ఊరేగింపుగా బొడ్రాయి, మైసమ్మ, పోతురాజు, పెద్దమ్మ ఆలయాలకు చేరుకొని ధూప, దీప, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించారు.

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: శ్రావణ సోమవారం సందర్భంగా మండలంలోని ఆవంచ, బుద్దసముద్రం, రాళ్లచెరువుతండాల్లో పోచమ్మ బోనాలు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాల మధ్య బోనాలతో ఊరేగింపు చేపట్టారు. మహిళలు భారీ సంఖ్యలో హాజరై బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుద్దసముద్రంలో పోచమ్మ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు.

సత్వరమే సమస్యల పరిష్కారం

కందనూలు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి'కి ఎనిమిది ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్ తెలిపారు. బాధితులతో ఎస్పీ మాట్లాడి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించి, సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ

కందనూలు, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు వెల్ఫేర్ నూతన కార్యవర్గాన్ని ఇటీవల కాలంలో ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సోమవారం పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలవగా...ఎస్పీ ఘనంగా సన్మానించారు. జిల్లా పోలీసుశాఖ అభివృద్ధికి వివిధ రకాల చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏవో కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలకు సిద్ధమవ్వాలని పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలపై ఆందోళనలు చేసేందుకు భారాస కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మనోహర్, శ్రీకాంత్ భీమా, నర్సింహగౌడ్, తులసీరాం, రమేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని భారాస జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎంజేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో తాడూరు మండలంలోని పర్వతాయిపల్లి తండాకు చెందిన విద్యార్థిని అనూషకు ఇంజినీరింగ్ విద్య అభ్యసించేందుకు రూ.50వేల సాయం చేశారు.

తెలకపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో సోమవారం భారాస కార్యకర్తలు, స్థానికులను మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కలిశారు. ఆయన అచ్చంపేట వెళ్తూ స్థానికంగా రోడ్డు పక్కన కార్యకర్తలు, స్థానికులతో మాట్లాడారు. గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ ఛైర్మన్ హనుమంతరావు, వార్డు సభ్యుడు కె.శ్రీను పాల్గొన్నారు.

బకాయిల విడుదలకు డిమాండు: కందనూలు, న్యూస్‌టుడే: విద్యార్థుల బోధనా రుసుములు, ఉపకార వేతనాలు రూ.12 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం నాయకులు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

పెద్దాపూర్‌లో గ్రామసభ: వెల్దండ, న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ప్రభుత్వం జారీ చేసిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో దేన్నైనా ఇవ్వొచ్చని ఆర్డీవో ఎంపీ జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. పెద్దాపూర్ గ్రామసభలో మాట్లాడారు.

బిజినేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించనున్న ఆసరా పింఛన్లకు సోమవారం దరఖాస్తులు వెల్లువెత్తాయి. బిజినేపల్లి మండల వ్యాప్తంగా సోమవారం 40 మంది అర్హులు దరఖాస్తు చేసుకోగా, మొత్తం 1042 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో కతాలప్ప తెలిపారు.

పండుగ వాతావరణంలో విషాదం

తెలకపల్లి, న్యూస్‌టుడే: పండుగ వేడుకలో ఓ వ్యక్తి ఆకస్మికంగా హఠాన్మరణం చెందడంతో ఒక్కసారిగా విషాదం నెలకొంది. ఉపాధ్యాయుల కథనం మేరకు...పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు బీరం మురళీధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వేడుక అంతా సజావుగా సాగింది. చివరలో ఉపాధ్యాయుడు మురళీధర్‌రెడ్డి సొంత బావమరిది వడ్డె విజేందర్‌రెడ్డి (51) వేదికపై ఉన్న బావను కలిసేందుకు వెళ్తున్న తరుణంలో కుప్పకూలిపోయారు. 108 వాహనంలో నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే ఆయన చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు ఇబ్రహీంపట్నం ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులున్నారు. పోస్టుమార్టం అనంతరం పీడీ మృతదేహాన్ని హైదరాబాదులోని సొంత నివాసానికి తరలించారు.

విజేందర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మిడ్జిల్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన మిడ్జిల్ మండలం లింబ్యాతండా శివారులో 167వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రేవల్లికి చెందిన శ్రీశైలం ద్విచక్ర వాహనంపై జడ్చర్ల నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు జడ్చర్లలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ: కందనూలు, న్యూస్‌టుడే: మండలంలోని బొందలపల్లిలో భూమికి సంబంధించిన గెట్టు పంచాయతీల్లో ఇరువర్గాల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తొలుత ఓ వర్గానికి చెందిన వ్యక్తులు ఓ యువకుడిపై దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత ఆయనకు సంబంధించిన కుటుంబసభ్యులు తిరిగి వారిపై దాడికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. ఇందులో ఓ పార్టీకి చెందిన నాయకులు అధికారం అడ్డంపెట్టుకొని దాడికి పాల్పడుతున్నారని గాయపడిన యువకుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు పట్టణంలోని జనరల్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నట్లు తెలిసింది. దీనిపై ఎస్సై వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా...ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు: కోడేరు, న్యూస్‌టుడే: కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాలకు ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్న ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడటంతో గాయాలపాలయ్యారు. సోమవారం విధుల నిమిత్తం కోడేరుకు వచ్చి కొల్లాపూర్‌కు తిరిగి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. . హెడ్ కానిస్టేబుల్ కిషన్ నాయక్ విధులు ముగించుకొని సాయంత్రం ద్విచక్రవాహనంపై కొల్లాపూర్ వెళ్తున్నారు. ఎత్తం గట్టు సమీపంలో అస్వస్థతకు లోనై కిందపడిపోయాడు. విషయం తెలుసుకున్న కోడేరు పోలీసులు వెంటనే ఆయన్ను కొల్లాపూర్, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు.

(c) eenadu